నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 16 మే 2025 | MEDAK

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం గొంగ్లూరు శివారులో తడిసిన ధాన్యం బస్తాలు, కొట్టుకుపోయిన ధాన్యం

ధాన్యం.. వర్షార్పణం

అకాల వర్షంతో తడిసిన ధాన్యం కుప్పలు

- పలు గ్రామాల్లో వర్షం నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున తడిసిన ధాన్యం
- టార్పాలిన్లు లేక తడిసిన ధాన్యం
- రైతులకు శాపంగా ట్రాన్స్‌పోర్టు సమస్య
- ధాన్యం తరలింపులో అధికార యంత్రాంగం విఫలం
- తడిసిన ధాన్యం మిల్లులకు తరలించకపోతే మొలకెత్తే అవకాశం
- వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటలు

పుల్కల్ మండలం గొంగ్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో ట్రాక్టర్లపై టార్పాలిన్లు కప్పిన రైతులు

సంగారెడ్డి, మే 15(నమస్తే తెలంగాణ): అకాల వర్షాలు వరి రైతు వెన్నువిరిచాయి. బుధవారం రాత్రి, గురువారం ఉదయం సంగారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. చేలు, రహదారుల పక్కన రైతులు ఆరబోసిన ధాన్యం వర్షార్పణం అయ్యింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన, బస్తాల్లోని ధాన్యం సైతం తడిసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షానికి తోడు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినా ధాన్యం భద్రపరిచేందుకు, తరలించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చిన రైతులకు టార్పాలిన్లు, గన్నీబ్యాగులు సమకూర్చడంలో అధికారులు విఫలమయ్యారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించక పోవడంతో ధాన్యం వర్షానికి పెద్ద ఎత్తున తడిసిపోయింది. తడిసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించకపోతే మొలకెత్తే అవకాశం ఉంది. ఇదే జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకటి రెండురోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అంతా మిల్లులకు తరలించే అవకాశాలు కనిపించడం లేదు. ట్రాన్స్‌పోర్టు సమస్య సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రతిరోజూ వాహనాలు రావడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. తిరిగి వర్షాలు కురిసిన పక్షంలో మరింత ధాన్యం తడిసి రైతులకు నష్టం మిగిలే ప్రమాదం పొంచి ఉంది. బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం కొండాపూర్ మండలంలో పర్యటించి తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించారు.

పుల్కల్ మండలం గొంగ్లూరులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

సంగారెడ్డి మండలం కల్పగురులో...

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చౌటకూరు మండలంలో తడిసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

పెద్దఎత్తున తడిసిన ధాన్యం

సంగారెడ్డి జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం భారీగా వర్షం కురిసింది. జిల్లాలో మొత్తం 2.9 సెం.మీటర్ల సాధారణ వర్షం పాతం నమోదైంది. పుల్కల్ మండలంలో అత్యధికంగా 7.9 సెం.మీటర్ల వర్షం కురిసింది. రెండు మండలాల్లో అత్యధిక వర్షం కురవగా, 12 మండలాల్లో సాధారణం కంటే 50 శాతం అధికంగా వర్షం కురిసింది. కోహీర్‌లో 7.3 సెం.మీటర్లు, సదాశివపేటలో 5.9, కొండాపూర్‌లో 5.8, జిన్నారంలో 4.7, చౌటకూరులో 4.6,గుమ్మడిదలలో 4.3 సెం.మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 4 నుంచి 2 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదైంది. భారీగా కురిసిన వర్షాలతో ఆరబోసిన ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. అందోలు మండలం అల్లాయిపేటలో వర్షానికి చేలలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రోడ్డుపక్కన ఆరబోసిన ధాన్యం వర్షం నీటికి కొట్టుకుపోయింది. టార్పాలిన్లు లేకపోవటంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది. అల్మాయిపేటలో సుమారు 20 నుంచి 30 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. నేరేడిగుంట కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యంతోపాటు మిల్లుకు తరలించే ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. చింతకుంటలోని కొనుగోలు కేంద్రం వద్ద సుమారు 20 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. అందోలు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి 30 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. చౌటకూరు మండలంలోని కోర్పోల్ కొనుగోలు కేంద్రంలో 800 ధాన్యం బస్తాలు, చౌటకూరులో 1600, చక్రియాల్‌లో 400, గంగోజిపేట 250 బస్తాల ధాన్యం తడిసిపోయింది. తాడ్దాన్‌పల్లి, బద్రిగూడెం, ఉప్పరిగూడెంలో సుమారు 200 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయినట్లు రైతులు తెలిపారు. పుల్కల్ మండలంలోని పుల్కల్, గొంగ్లూరు గ్రామాల్లో వర్షానికి సుమారు 1200 క్వింటాళ్ల వరకు ధాన్యం తడిచిపోయింది. రైతులకు అవసరమైన టార్పాలిన్లు సమకూర్చక పోవడం, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను తరలించక పోవడంతో వర్షానికి ధాన్యం తడిసి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కల్పగురు తదితర గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. కంది గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మిల్లులకు తరలించాల్సిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. సదాశివపేట మండలంలోని కొల్లూరు గ్రామంలో సుమారు 20 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. కొండాపూర్ మండలంలోని సీహెచ్ కొనాపూర్‌లో మొక్కజొన్న పంట వర్షానికి తడిసిపోయింది. గ్రామంలోని చేలల్లో ఆరబోసిన మొక్కజొన్న పంట పూర్తిగా వర్షానికి తడిసిపోయి రైతులకు అపార నష్టం మిగిల్చింది. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీహెచ్ కొనాపూర్ గ్రామాన్ని సందర్శించి పంట నష్టపోయిన రైతులను కలిసి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సైతం ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ధాన్యం తడిసిపోవటంతో రైతులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం కారణంగానే వర్షాలకు ధాన్యం తడిసిపోయి నష్టం చవిచూడాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

– చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిపడ్డారు. కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్‌లో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో వరి, మొక్కజొన్న, జొన్న రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండాపూర్ మండలంలో ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు తడిసిన ధాన్యం, మొక్కజొన్న, జొన్నలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

వర్షంలో సైతం రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, మే 15: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని సీహెచ్ కోనాపూర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పట్టించుకోకుండా ప్రభుత్వం అందాల పోటీల్లో నిమగ్నమైందన్నారు. రైతుల సంక్షేమం కంటే సీఎం రేవంత్‌కు అందాల పోటీలు ముఖ్యమయ్యాయని విమర్శించారు. రైతులు ఇంత ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ధాన్యం సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోయినట్లు తెలిపారు. కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్‌కు చెందిన రైతు పెద్దాపురం బాలకృష్ణ 3 ఎకరాల్లో మక్క సాగుచేసి నష్టపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవో గణేశ్, ఏఈవో రవి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, నాయకులు పాండురంగం, నగేశ్, రాందాస్, సంగారెడ్డి, మోహన్‌గౌడ్, శేఖర్, నజీర్, బాలాగౌడ్, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజు, పవన్‌కుమార్, గ్రామస్తులు జైరాములు, శాంతయ్య, మహేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

దౌల్తాబాద్‌లో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మే 15: అకాల వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్, దౌలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిసిముద్దవుతున్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలన్నారు. కొనుగోలు చేసిన అనంతరం డబ్బులను సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన రైతులకు అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు.

చక్రియాల్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంటి క్రాంతికిరణ్, జైపాల్‌రెడ్డి

ప్రభుత్వ తీరుతో రైతులకు కష్టాలు

- మంత్రి దామోదర తీరు బాధాకరం
- అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడాలి
- అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మండిపాటు

చౌటకూర్, మే 15: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలోని చక్రియాల్‌లో బుధవారం తడిసిన ధాన్యాన్ని గురువారం బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా తడిసిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ముందుచూపు లేదని, వర్షాలు కురుస్తాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి సూచనలు, సలహాలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఎలాంటి ప్రణాళికలు లేకుండానే కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా ధాన్యం నిల్వలు ఉంచడంపై నిరసన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంపై అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనరసింహ అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఒక్కసారి కూడా సమీక్షా నిర్వహించక పోవడం సిగ్గుచేటన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయని, ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని విమర్శించారు. ధాన్యం సేకరణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, మొద్దునిద్ర పోతున్నారని మండిపడ్డారు. తూకం వేసిన బస్తాలు సైతం వర్షం ధాటికి తడిసిపోయాయని, రవాణా సౌకర్యాన్ని కల్పించడంలో జాప్యం చేస్తున్నారని, లారీల కొరత కారణంగా ధాన్యం రాశులన్నీ నీటిపాలయ్యాయని చంటి క్రాంతికిరణ్ విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రైతులకు ఎదురు కాలేదని గుర్తుచేశారు. మంత్రి దామోదర హైదరాబాద్‌కు పరిమితం అయ్యారని, రైతుల సమస్యలు ఆయనకు పట్టడం లేదని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతుంటే కాంగ్రెస్ నాయకులు ఎక్కడికి పోయారని క్రాంతికిరణ్ మండిపడ్డారు. సిమెంట్ లైనింగ్ పేరుతో సింగూరు ఎడమ ప్రధాన కాలువకు నీళ్లు వదలకుండా క్రాప్‌హాలిడే ప్రకటించి రైతులను ఆర్థికంగా దెబ్బతీశారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ గాజుల వీరేందర్, సర్పంచులు ఫోరం ఉమ్మడి పుల్కల్ మండల అధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, నాయకులు తుంగె అనంతయ్య, ఆర్.మల్లేశం, తుంగె మల్లేశం, కొత్తగొల్ల రవి, డాకూరు అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం

ఎపిటోరియా పరిశ్రమలో విచారణ చేపట్టిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

హత్నూర, మే 15: పరిశ్రమలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హత్నూర మండలం బోర్పట్ల శివారులోని ఎపిటోరియా పరిశ్రమ, నూతనంగా నిర్మిస్తున్న తెరనీయం బయాలోజి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలపై స్థానికులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా, నీటిపారుదల ఎస్ఈ ఏసయ్య, పీసీబీ ఈఈ గీత గురువారం పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో బోర్పట్ల గ్రామస్తులు ఎపిటోరియా పరిశ్రమతో ఎదురవుతున్న ఇబ్బందులు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. పరిశ్రమలో నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ అనుమతులు తీసుకోవడం తెలియదా అని పరిశ్రమ ప్రతినిధులను హెచ్చరించారు. ఇప్పటికే అక్రమ నిర్మాణాలపై మూడు నోటీసులు ఇచ్చినా సంజాయిషీ ఇవ్వకపోగా యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగించడంపై ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలుష్య జలాలతో ఇబ్బందులు పడుతున్నామని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తే శాంపిల్స్ సేకరించి వెళ్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అధికారులతో మొరపెట్టుకున్నారు. కాలుష్యం తీవ్రత ఎక్కువగా ఉంటే చర్యలు తీసుకోవాలని పీసీబీ ఈఈని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎస్ఈ ఏసయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసూఫ్, డీటీ దావూద్, కార్యదర్శి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో 6జీ టెక్నాలజీపై ప్రదర్శన

కంది, మే 15 సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో గురువారం అధునాతన టెక్నాలజీ మించిన 5జీ (బీ5జీ),6జీ లాగ్‌ల కోసం గ్రౌండ్ బ్రేకింగ్ ఫీల్డ్ ప్రదర్శనలు నిర్వహించారు. షార్ప్ సెమీకండక్టర్ ఇన్నోవేషన్ కార్పొరేషన్ జపాన్ (ఎస్ఎస్ఐసీ), ఐఐటీహెచ్, డబ్ల్యూఎస్ఐజీ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు సంయుక్తంగా ఈ అధునాతన సాంకేతికతపై ప్రదర్శలు చేశారు. ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్, మిషన్–క్రిటికల్ పుష్‌టు టాక్, అటానమస్ నావిగేషన్, శాటిలైట్‌కు అనుకూలమైన ఎన్‌బీ–ఎల్ఓటీ స్మార్ట్ మీటరింగ్ వంటి అధునాతన అప్లికేషన్లకు మద్దతు గా ఈ 6జీ టెక్నాలజీ పనిచేస్తుందని, 2026 లో ఈ టెక్నాలజీని విస్తరింపజేయాని లక్ష్యం గా పెట్టుకున్నట్లు ఐఐటీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిస్తుందన్నారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిలో ఐఐటీహెచ్ అగ్రగామిగా నిలుస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా హనుమాన్ తెప్పోత్సవం

- హనుమాన్ దీక్షకు పెట్టింది పేరు మన సిద్దిపేట
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, మే 15: హనుమాన్ దీక్షకు పెట్టింది పేరు మన సిద్దిపేట అని, విజయవాడ కృష్ణా నదిపై జరిగే తెప్పోత్సవం ఆరేండ్లుగా మన సిద్దిపేటలో జరుపుకోవడం ఆంజనేయుడి ఆశీర్వాదంగా భావిస్తున్నానని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం రామరాజు రావిచెట్టు హనుమాన్ ఆలయం ట్రస్, హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెప్పోత్సవాన్ని ఆరేండ్లుగా సిద్దిపేటలో ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. దేశంలో హనుమాన్ మాల ఎక్కువ వేసుకునేది మన సిద్దిపేటలోనేనని, హనుమాన్ దీక్షకు భిక్ష కార్యక్రమం ఎక్కడ మొదలైంది అంటే సిద్దిపేటలోనే అన్నారు. ఈ దీక్షను మొదట సిద్దిపేటలో ప్రారంభించారన్నారు. సిద్దిపేట ధార్మిక కార్యక్రమాలకు పెట్టింది పేరని, అమర్నాథ్, కేదార్‌నాథ్ అన్నదాన సేవలు నిర్వహిస్తున్నది మన సిద్దిపేట ధార్మిక సంస్థలేనన్నారు. ధార్మిక కార్యక్రమం ఏదైనా సరే సిద్దిపేట ముందుంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎక్కడైతే హనుమంతుడి పూజ జరుగుతుందో, ఎక్కడైతే హనుమాన్ చాలీసా పఠనం జరుగుతుందో అక్కడి ప్రజలకు హనుమంతుడు కొండంత ధైర్యాన్ని ఇస్తాడన్నారు. తెలంగాణలో హనుమంతుడి గుడి లేని ఊరు లేదన్నారు. దేవుళ్లకే సహాయం చేసిన అంజన్న మనుషులకు సహాయం చేయరా అన్నారు. ప్రతిరోజూ మన జీవితంలో ఆంజనేయుడి పూజా కార్యక్రమం నిర్వహించుకొని, హనుమాన్ చాలీసా పఠించాలన్నారు. దుర్గాప్రసాద్ స్వామీజీకి మన సిద్దిపేట అంటే ఎంతో అభిమానం అన్నారు. ఈ సంవత్సరం సిద్దిపేటకు వచ్చి ఒకరోజు మాల వారి చేతి మీదుగా వేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. అంజన్న దయతో మళ్లీ మన తెలంగాణకు మంచి భవిష్యత్తు రావాలన్నారు. ఇక్కడ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని హరీశ్‌రావు అన్నారు. మన దేశం ప్రపంచ దేశాల్లో అత్యంత శక్తివంత దేశంగా ఎదగాలని హనుమంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దేశం, మన రాష్ట్రం వికసిల్లాలని కోరుతూ మరోసారి ఈ కార్యక్రమాన్ని ఇంత బ్రహ్మాండంగా నిర్వహించిన దుర్గాప్రసాద్ స్వామీజీకి కృతజ్ఞతలు తెలిపారు.

దైవసందేశం వినిపిస్తున్న దుర్గాప్రసాద్ స్వామీజీ

మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట కోమటి చెరువులో హనుమాన్ తెప్పోత్సవం

తెప్పోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పోలీసులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, మే 15: పోలీసులు విధి నిర్వహణతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో పోలీస్ స్టేషన్లు, సర్కిల్, డీఎస్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, వివిధ వర్టికల్ విభాగాల్లో ప్రతిభ కనబర్చాలని, ఎఫ్ఐఆర్ మొదలుకొని డాటా ఎంట్రీ, ఈపెట్టి కేసులు, ఈ చల్లాన్ నమోదు వరకు ఎలాంటి సందేహాలున్నా శిక్షణతో నివృత్తి చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం కూడా ఐటీసెల్ సేవలను వినియోగించుకొని, వర్టకల్ విభాగంలో జిల్లాను మందు వరుసలో నిలబడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫంక్షనల్ వర్టికల్ మానిటరింగ్ అధికారి, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, వర్టికల్ కోఆర్డినేటర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఐటీ పెల్ సిబ్బంది సంజీవ్, చంద్రశేఖర్, రవి, శ్రీకాంత్‌తోపాటు వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.